# సమ్మె — విస్తరణ

కార్మిక

5 గంటల సైరన్ కూత అయితనే ఆడోల్లు నిద్రలేచి బొగ్గుపొయ్యిలు అంటేపెటోల్లు. తల్లులు లేసెటాల్లకు సంటిపిల్లలకు తెలివిపడి పిలగాండ్ల ఏడుపు. పొద్దటి బదిలి (డ్యూటి) వచ్చిందంటనే పనికి పోయెటోల్లకు తిప్పలే, వండి పెట్టెటోల్లకు తిప్పలే. నిదురచ్చినా, పొరగాండ్లు ఏడ్సినా, చాతగాకపోయినా చీకటితో నేలేచి పొయ్యి అంటేసి కూడు అందుడు తప్పదు. పొయిల్లల్ల నుండి వచ్చేపొగకు పొద్దుపొడిచింది కూడ ఏర్పడదు.

పొయ్యిలు అంటేత్తనే నీల్ల కురుకాలె. వాడంతటికి ఒక్కటే నల్ల. నీల్లు దొరుకుతయోలేదోనన్న ఏగిరం. ఎంత ఏగిరపడి పంపుకాడికి పోయినా పోయెవారకే ఆడోల్లలొల్లి, కుండల సప్పుడు.

"మాఆయినది పొద్దటి డూటి నన్నొక కుండెడు నీల్లు పట్టుకపోనీయుండ్లి" ఒకరు.

"డ్యూటికి యాల్లయిపోతాంది పొయ్యిమీద బియ్యంపెట్టిన ఒక్క బిందెడు పట్టుకపోనీండ్లి దండంపెడుత" ఇంకొకరు.

ఇప్పుడచ్చే పట్టుకుంటనంటె మొదాలచ్చినోల్లం ఈన్నె ఉండాల్నా.

"నీమొగడే బాయిల పనిచేత్తాండు గాని నామొగడు చేత్తలేడా" అంటూ ఇంకొకరు.

నాకుంద ముట్టుడయ్యింది కొత్తది కొనియ్యి "చిన్నపెద్ద తేడేలేకుంటయింద"ని పెద్దకులపోల్ల బూతులు

"నీ కులంపెద్దదయితె ఇంటికాన్నే పంపేసుకోకపోయినవా" తక్కువకులపోల్లు.

నేను ముందంటే నేను ముందని తన్నులాటలు, సిగపట్లు, బండబూతులు, కుండలు పలుగుడు.

యాల్లయి పోవట్టె గుడిసెనుండి ఓగంట ముందుగాల్నె బయిల్లెల్లి 8 మైల్లు సైకిలు తొక్కితొక్కి తిన్నకూడు అరిగెతట్టు ఆదర బాదరపోతెనే డూటికిఅందినట్లు లేటయితె డ్యూటి ఎత్తిపోద్దని మొగోల్ల ఏగిరం.

757

పొద్దుగాల చీకట్ల లేచిపోతే పనిచేసి ఇంటికి తిరిగచ్చేటాల్లకు పొద్దుగూకె. కడుపుల ఆసర లేకుంటె బొగ్గుతట్ట ఎట్లమోత్తరు. రాత్రి మిగిలిందిపెడ్తె సలికూడవి సరిగ్గ తినిపోరని పాతులాట.

స్నానం చేసినట్టు పెయిలకెల్లి చెముటకారంగ, కనిపించి కనిపించని మసుక లైటులోని, మందువాసన పొగల ఊపిరిఆడకుండ బొగ్గుతట్టెత్తుకోని ఎక్కడ జారి పడిసత్తనోనన్న బయంతో, పిక్కలునొప్పి పెట్టుతాంటె చెడాబు ఎక్కుకుంట తట్టెత్తుకపోయి లాడీసులునింపి. పెయ్యంత నొప్పిపెట్టి, కాల్లుచేతులు గుంజుతాంటె అలిసిటతోని పడుకొన్న బర్తలను "డ్యూటి యాల్లయితాంది లేత్తెగాదా", ఆడోల్ల అరుపులు. "జెరాగ్రె చాతనయితలేదు కాల్లుగుంజుతానయి" మొగోల్ల గునుసుడు.

పిలువంగ పిలువంగ లేచి 6 గంటల సీటి అయితదని ఆదర బాదరగ కూడు తిని, బూట్లుతొడుక్కోని, తలకు టోపిపెట్టుకోని, తట్టచెమ్మాసు పట్టుకొని సల్లంగ ఇంటికి తిరిగత్తనో ? లేదో? నని పిలగాండ్లను చూసుకోని, పెండ్లానికిచెప్పి డ్యూటికి బయిలెల్లుతరు.

నడిచిపోయేటోల్లు నడిచి, సైకిల్లమీద పోయెటోల్లు సైకిల్లమీద డ్యూటికి పోతాంటె, పెయ్యంత బొగ్గుమసి అంటి, గరిమిల బొగ్గుమోసి నడువచాతగాక ఈడ్సు కుంట ఈడ్సుకుంట ఇండ్లలకత్తాంటె గాయాల్లకు రోడ్లమీద ఎక్కడ సూసినాకార్మికులే.

బాయిలు నడిచినప్పుడే గిదంత. గాని గిప్పుడు లేదు గాతీర్గ,

తెల్లారుతుండంగనే 5 గంటల సైరన్ కూతమోగింది. సైరన్‌కూత ఇన్న ఆడోల్లు సదురుకోని పంటాండ్లుకాని లేత్త లేరు. తల్లులు పక్కల్నే ఉన్నరన్న దైర్యంతో పిల్లల ఏడ్పుల్లేవు. పొద్దుపొడుపు ఎల్లినా పొయిలల్ల నుండి పొగ ఎల్లుతలేదు.

అర్దగంటసేపు పడే పంపునీల్లకు మాత్రం ఆరాటం తప్పుత లేదు.

డ్యూటికి యాల్లయిపోతాందనేటి ఏగిరం లేదు మొగోల్లకు. బాయిల దిగుడు లేక చాల దినాల నుండి మూలకుబడ్డ తట్ట చెదలుపట్టింది. గుడెపె బొంగులకు కట్టిన టోపి పొగబట్టి నల్లబడుతాంది, తీసుడులేక మూలకుపడ్డ చెమ్మాసు చిలుము పట్టింది.

సైరను సప్పుడేకాని సొరెడు బొగ్గు అత్త లేదు బాయిల్లల్ల నుండి.

పండ్లల్ల పుల్లేసుకోని హాజరన్నపడి అత్తమని కొందరు, బాయికాడ ఏమిసంగతి తేలుద్దో చూసివద్దామని కొందరు - బాయిల మీదికి పోతాండ్లు, తెల్లారంగనే ఇంటి ముంగట ఎవలో పిలుత్తాండ్లన్న అలికిడి ఇనంగనే కండ్లుతూడ్సుకుంట బైటికచ్చింది రాజయ్య.

758

ఊరికి పోతివిగదా మాయిల్లమే అచ్చినవ్ కండ్లుతూడ్చుకుంటనే అడిగిండు చెందర్రియ్యను. "ఊరిసంగతి చెప్పుతగని, బాయిలు నడుత్తనయా ?" కండ్లుతూడ్చు కుంట కూకుండిపోయిన రాజయ్యకు చెందర్రియ్య మాటలు ఇనంగనే నిదర్రిమబ్బు తేలి పోయినట్టయి ఎనుకకుదిరిగి 'బాయిలు నడుసుడంటె అగమేనా ఏసంగతి తేలంది ఎట్లనడుత్త యనుకుంటున్నవ్ బాయిలు నడుసుడుగాదు రామకిష్టాపురం డివిజన్ బాయిలు కూడ బందైనయ్ ఇగేం నడుత్తయ్ బాయిలు దినదినంవారాలు గడువబట్టె బాఎనుకబాయి బాయిలన్ని బందుగావట్టె, గిట్లయితే బాగనేతింటం చిట్టిపెసలెట్లగట్టుడో ఏమో;" చెందర్రియ్య ఠందిపడుకుంట ఇంకేదో మాట్లాడుదాంఅనుకోంగనే చెందర్రియ్య బార్య చేతులూపుకుంట మాట్లాడుతూ వాకిట్లకచ్చింది. "నీకు చిట్టికెల్లకపోతే కంపినో నికి ముద్దా ? గిసోంటోల్లు ట్రయికెందుకు చేసిండ్లు, తన్నినా గుద్దినా నోరుమూసుకుంట పనిచేత్తెగాదా ?" సంకలున్న పిల్లగాడు ఏడుస్తున్నా గాఏడుపుసంగతి పట్టించుకోకుండనే చెప్పుతాంది.

మాటల సందడిలో బీడి అంటించుకుందామని గీకిన అగ్గిపుల్ల సంగతేమరిచి మాటలింటాంటే చేయి సుర్రుమంది, పెండ్లాం మాటలకు రేషమచ్చింది చెందర్రియ్యకు "చల్....నువ్విక్కన్నుంచి ఎల్లిపో నువ్వేంచెప్పుతన్నవు నాకు గాపోరాగాన్ని ఊకుంచ రాదు, రాజకీయం చెప్పుతనవానాకే."

చెందర్రియ్య ఎవారానికి కోపానికి రావన్నో, నవ్వాన్నో సమజుగాలె రాజయ్యకు.

'గాదానిమీద [illegible]కె దుకెగురుతవ్ గాఎగిరేదేదో దొరోనిమీది కెగురుతెగాదా ? అయినా లచ్చక్క అన్నదాంట్ల ఏం తప్పున్నది. గానెల రోజుల కింద మీబదిలి పిల్లరోల్లే లొల్లిబెడ్తిరిగదా పేం పనిలెక్క 3 ఏండ్లాయె ఇంకా పర్మనెంటు చేత్తలేరు కంపినోల్లని, గప్పుడు నువుకూడ బాగనే మాట్లాడితివిగదా, గప్పుడు గూడ బాయిబందు పెడ్తె ఇద్దర్ని జైళ్ళ పెట్టిరిగదా ? గట్లనే ఇప్పుడు గూడ, లాడీనోనికి కాలుమీద బొగ్గు పెల్లబడి కాలు చితల్ చితలు అయ్యి కాలంత వాపెక్కి, దొరా నానొప్పి ఇంకతగ్గలేదు నన్ను దావఖాన్లనే అన్‌ఫిట్‌లో ఉంచుండ్లని గట్టిగ చెప్పినందుకే గావాని బాదంత సూడ కుంటనే డాక్టరోడు పిట్టుజేసే, మీదికెల్లి అరెస్టు చేపించే, నీకు గిట్లయితే ఊకుంటవా' రాజయ్య మాటలకు బీరిపోయి సూత్తాండు చెందర్రియ్య.

రాజయ్య ఇంకేదో చెప్పుదామనుకునటాల్లకే ఏదో ఎత్తిపోతునట్లు మోగుతాంది సైరన్ కూత, కూత సప్పుడు ఇంటనే కూసున్నోడు లేచి; "7 సీటి అయితాంది బాయి కాడికి పోదాంపా" అంటు కదిలిండు రాజయ్య.

759

రాజయ్య ముంగట నడుస్తుంటె ఎనుక చెంద్రియ్య బయల్దేరిండు.

"నిన్ననే రాత్రిబదిలి (మూడోషిఫ్టు) నడుత్తదన్నరుగాదా ఏమయింది. నువ్వు పోలేదా డ్యూటికి" వెనుక వస్తున్న చెంద్రియ్య మాటిని నిలబడ్డడు రాజయ్య.

"అ.. నిన్న యూనియనోల్లు బజారు మీద మందిని జమజేసి చెప్పిండే అబాయి ఈబాయోడు అంతా 50 మంది దాకా వాళ్ళ మనుషులే జమఅయిండ్లు. యూనియనోల్ల మాటిని బాయిలల్లకు దిగుతే మనగురించి పట్నంలొకొట్లాడి అడ్వాన్సు ఇప్పిత్తనన్నడు".

"అయితే లేబరోల్లు ఏమన్నరు" చెంద్రియ్య. "లేబరోల్లెవరు? అచ్చినోల్లు వానోల్లే కాబట్టి సరేఅంటే సరేఅన్నరు. గంతల్లకే ఏమున్నది జే అంటే జై అనిపించిండు లీడరాయన. ఇంకేమున్నది ఊరంత పర్చారం చేసిండ్లు! రాత్రి బదిలి నడుత్తదని అవుగని నువు ఊరికేపోతివి నీకెవ్వలు చెప్పలేండ్లు?"

'గా.... 5 ఇంక్లయిన్ల చేసెటోడు మా ఊల్లెగల్పి చెప్పిండె' చెంద్రియ్య.

'వాడు లీడరోల్ల మనిషి గావచ్చు నీతో చెప్పింది అందుకే ఊరికి పోయినోనివి మాయిల్లమె తిరిగచ్చినవా' రాజయ్య. ఊరు సంగతి తీపెటాల్లకు మనుసుల కలకల మన్నది చెంద్రియ్యకు. కాసేపు ఏమి మాట్లాడకుండనే నడిసిండు.

చెంద్రియ్య మాటెందుకు బందుజేసిండో సమజుగాక "మాట్లాడవేందే అన్నడు" రాజయ్య.

"ఏం మాట్లాడెతట్టున్నది, ఏమి జెప్పెతట్టున్నది ఏడసూడబోదమన్నా ఏమి సక్కదనంలేదు. అంత నాషన గాలానికేవుంది".

"ఏమయిందేంది" ముంగట నడుస్తున్న రాజయ్య ఎనుకకు తిరిగి అడిగిండు.

"బాయిలు బంద్లై, జీతంలేక బియ్యానికి తిప్పలగావట్టెగదా మా అన్నదగ్గరికన్న పోయి ఏమన్న రూపాలడుకచ్చుకుందామని ఊరికిపోతే ఏమున్నది ఇక్కడి కంటె ఎక్కువే నడిసింది అడగూడ."

ఇంకేదో చెప్పుదామనుకునేటాల్లకే అడిగిండు రాజయ్య "ఏమన్న లొల్లి జరిగిందా ఇంటికాడ."

"ఇంటికాడగాదు, ఊల్లనే జరుగుతాంది ఊరోల్లకున్నూ దొరోనికి కూల్లు, కయికిల్లు, జీతాలు పెరుగన్నని ఊల్లె సంఘంబెట్టి, దొరోనితోని వాల్లు చెప్పకుంటే వాడు ఇనలేదట, అయితేమయిందంటే ఊల్లోలంత దొరకు పనికిబోవుడు బందు పెట్టిండ్లట, ఇంకేమున్నది దొరోడు పోలీసోల్లను పిలిపించి పనికి రానోల్లందర్ని

760

కొట్టుతాంటే అడోల్లు, మొగోల్లనకుండ వాల్ల యిట్టంవచ్చినట్లు కొడుతాంటే ఊరు యిడిసి దెంకవోతాండ్లందరు. మాటడు కూడ ఎటోవోయిండట. నేను ఊల్లెకు వోయె సరికి పోలీసోల్లు నన్నుపట్టుకోని రాడికల్లోనివార నువ్వు అని తన్నుకుంట దొరోనింటికి తీసుకవోంగనే అడ పటువారోడు కలిసి "వీడిక్కడోడుగాదు" సుట్టీరాకని కచ్చిండు అన్నింటికీ. వీన్నిడిసి పెట్టుండ్లంటె "మాదర్‌చోత్ ఎందుకచ్చిన వీడికి" అని ఇంతే దేదో తిట్టుకుంట ఎల్లివోఅని దొబ్బేసిండ్లు. ఇగ నాకాఊల్లె ఉండబుద్దిగాక తెల్లారేసి ఎల్లచ్చిన." పోలీసోల్లు కొట్టినదెబ్బ సూపించుకుంట చెప్పిండు చెందిరియ్య.

మాటలల్ల తొవ్వనడిసినట్లే ఏర్పల్లే, బాయి దగ్గరికిరానే వచ్చిండ్లు.

"ఏమయిందే? ఎటాయె: మాయిల్లమే తిరిగత్తాండ్లు:" హాజరుపడి ఇంటికచ్చే టోల్లను ఆపి అడిగిండు చెందిరియ్య.

"ఏమున్నది ఇగ బాయిలు నడుసెటట్టులేవు గదా ఊరికన్న వోదామని తొందరగ మర్లినం."

"గదిసరేగాని బాయిమీద ఏమి సంగతి జరిగింది," రాజయ్య.

"సంగతేంది ఉన్నసంగతే మస్టర్లు కోసుడు బరాబరేనట లాడీసోల్ల (లాడీసులల్లో బొగ్గు నింపేకార్మికులు) పేర్లురాసి బోర్డు ఏసిండ్లు, ఇంక ఎవలకో ముగ్గురికి "డిస్‌మిస్ లెటర్లు" గూడ యిచ్చిండ్లట:" చెప్పుకుంటనే ఇంటికి వోయెటోల్లు ఎల్లివోతాండ్లు.

"ఇగ గిట్లయితే బాయిలు నడిసినట్టే, ఇంకేంనడుత్తయి:" రాజయ్య.

"గాబెల్లంపల్లి బాయిలోల్లకు కట్టుచేసిన జీతంఇచ్చిండ్లటగదా గట్లనే మనకుగూడ ఇత్తెగానా గాడ్దికొడుకులు:" చెందిరియ్య.

"ఇగో.... అన్ని బాయిల మీద ఒక్కసారే కానూనుపెట్టె బాయిలన్ని బందయి తయిగావా, అందుకే వాల్లకు తిరిగిచ్చి, మనకు కట్టుజేత్తాండ్లు:" రాజయ్య.

"అగో! వాల్లకో కానూను మనకో కానూనా? నీయవ్వ మా ఊల్లెగూడ గిట్లనే చేత్తాండ్లు, కూలిపెంచుమని ఊరోల్లు బందుపెట్టె ఊరోల్లకు ఇవ్వకుండనే ఎక్కువ పైసలిత్తనని పక్కఊరోల్లను కూలికి తెచ్చుకుంటాండు దొరోడు:" చెందిరియ్య.

"వాల్లకిట్టమైందే కానూను. అక్కడోల్లకిచ్చి, ఇక్కడోల్లను దెబ్బకొట్టాలని సూత్తాండ్లు కంపినోల్లు" రాజయ్య.

761

"నీయవ్వ బలేఎత్తులున్నయి కంపినోనిదగ్గర" చెందర్రియ్య.

"బాయికాడ మంది బాగనే జమ అయినట్లు ఉన్నరుగదా" రాజయ్య.

"ఆ.... పోలీసోల్లుగూడ పొద్దుగాల్నే అచ్చిండ్లు" చెందర్రియ్య

మ్యాన్ వే ఆఫీసుకాడ హాజరుపడేటోల్లు హాజరుపడుతాండ్లు. గుంపుగ నిలబడ్డ మంది బోర్డుకు అంటించిన కాగితాలు సదువుతాండ్లు. సదువచ్చినోల్లు చదువుతాంటే రానోల్లు ఇంటాండ్లు. తుపాకులుపట్టుకొని 20 మందిదాక పోలీసోల్లు మర్రిచెట్టుకింద నిలబడ్డరు.

కట్టెచేతులపట్టుకున్న జెమదారు చెట్టుకాడికి, మేనేజరు ఆఫీసుకాడికి తిరుగుతాండు. బోర్డుకాడ మంది బాగజమయిండ్లు. ఏమి కాగితాలో ఎనుకోల్లకు కనబడుతలేవు. 'చదువెటోల్లెవరో బాగ సదువరాదుండ్లి' మందిలకెల్లి ఎవరో కార్మికుడు.

'నేను చదువుతుండుండ్లి' పయింటుతొడుక్కున్న కార్మికుడు ముందుకచ్చిండు.

కాగితాలమీద అన్ని లాడీసోల్లపేర్లే, 1160 మంది పేర్లదాక రాసున్నయి. పేర్లమీద ఇంకేదో రాసివున్నది. పేర్లకింద బాయి మేనేజరు సంతకం చేసివుంది.

ముందుకచ్చిన కార్మికుడు సదువుతాండు "ఇందు మూలముగా లాడీసు కార్మికులకు తెలియజేయునదేమనగా : కార్మికులు చట్టవిరుద్ధమైన సమ్మె చేయుచున్నందువలన కార్మికుల జీతం నుండి 8 మస్టర్లు కోతపెట్టబడును. అనగా ప్రతి కార్మికుని జీతం నుండి 281 రూ॥ కట్ చేయబడును." కింద పేర్లురాసివున్నయి.

చుట్ట తాగుతున్న ముసలి కార్మికుడు నోట్లోచుట్టను చేతిలపట్టుకోని తుపుక్కున ఊంచి "వారీ నిన్నవచ్చిన లీడరోడు అసలు కోతచట్టమేలేదనిచెప్పె, కంపినోడేమో నోటీసుబోర్డుపెట్టి కట్ చేత్తననబట్టె ఎవనిమాట నమ్మెతట్టులేదు".

"కోతపెట్టుటొక్కటేకాదు ముగ్గురికి "డిస్మిస్ లెటర్లు" కూడ ఇచ్చిండ్లట" ఇంకో కార్మికుడు.

డిస్మిస్ల సంగతి ఇనటాలకే ఎవలెవలకటా ? అంటూ దూరాన నిలుసున్నోల్లు దగ్గరికచ్చిండ్లు.

అప్పుడే కండ్లద్దాలు, జేబునిండ కాగితాలు పెట్టుకున్న మేస్త్రి గుంపులకచ్చి, మన సొరువచ్చిండు పోదాంపాండ్లని కార్లనుండిదిగిన లీడరుదగ్గరికి పోతాండు.

762

గా మేస్త్రిమాట పట్టించుకోకుండానే "లాడీసోల్లకు ఇద్దరికి, జనరల్ మజ్దూరాయినకు ఒక్కనికి లెటర్లు ఇచ్చిండ్లట"

నోట్లెసుట్ట కిందపారేసి ముసలోడు "బంచొత్ బాయిల ఎవడు దిగుతడో సూద్దాం, ఎవడన్నదిగుతె చెప్పులు మెడలేసి తింపుదాం".

"లాడీసోల్లు పైకుచేత్తె మజ్దూరాయినకు ఎందుకిచ్చిండ్లట" దవుడకు పొగాకు ఏసుకుంట అడిగిండు టింబరింగు కార్మికుడు.

"వీల్లముగ్గురు చేయబట్టె సమ్మె జరుగుతాందట. సమ్మెకు మీరే కారకులని, కార్మికుల్ని రెచ్చగొట్టి సమ్మెచేపిత్తాండ్లని ముగ్గురికి లెటర్లు యిచ్చిండ్లు" పయింటు తొడుక్కున్న బదిలీపిల్లర్ కార్మికుడు బడాబడాచెప్పిండు.

"యూనియన్ లీడర్ వచ్చిండుగదా ఏమిచెప్పుతడో సోదాంపా" కార్మికులు కదిలిండ్లు.

అక్కడక్కడ నిలుసున్న కార్మికులంతా ఒక్కకాడికి జమఅయిండ్లు.

"ఆపతి అత్తెనో ఆగిఅడగంది ఎల్లదాయె. ఆగిఅడుగుతెనో జీతం కోతపెట్టవట్టిరి మీదికెల్లి డిస్మిసులు చేయబట్రిపుల్ల ఎమర్జెన్సీకన్న ఎక్కువనే సాగించుకునేతట్టున్నది". కూసున్నోల్లులేసి మందిల కచ్చిండ్లు.

కండ్లద్దాలుతీసి చేతులపట్టుకోని చెయ్యిఊపుకుంట మాట్లాడుతాండు లీడరాయిన. వేరేబాయిలకాడి నుండి వచ్చిన లీడరాయిన యూనియన్ మనుసులు లీడరెనుక నిలుసున్నరు.

"కార్మిక సోదరులారా.... మీరంత కూర్చోండి".

"మనం కూకోకుంటె ఈనెకు సభచెప్పరాదా? కూసుంటేంది, నిలబడుతేంది నువు చెప్పేదేందో చెప్పరాదు"; మందిల నుండి మాటలు.

పరిస్థితి ఏమి బాగలేదనుకున్న లీడరాయిన తన ఉపన్యాసాన్ని మొదలుపెట్టిండు "కామ్రేడ్స్.... మీరంత ఐక్యంగాఉండి ట్రేడ్‌యూనియన్‌కు మద్దతునిస్తే మేనేజిమెంటుతోని కొట్లాడి ఏదైనా సాదించగలం. మేనేజిమెంటు చట్టాన్నితప్పుగా అర్థంచేసుకుంటాంది అసలు ఏకానూన్లో కూడ సమ్మెచేసినోల్ల జీతం కోతపెట్టడానికి కంపినోల్లకు అధికారంలేదు. కాని ఈ లేని చట్టాన్ని ఉన్నదని ప్రిచారంచేసి కొంత మంది కార్మికులు మిమ్ములను రెచ్చగొట్టి సమ్మెచేపిస్తాండ్లు"

లీడరుమాటలు పూర్తిగానేలేదు; గుంపుల గుసగుస మొదలయింది. "మనిషికి 281 రూ॥ జీతం కోతపెడుతున్నామని పేర్లురాసి బోర్డుపెట్టె కంపినోడు. కార్మికులు రెచ్చగొడుతుండ్లా కంపినోడా?"

ఆఫీసుముందు నిలబడి తనకేమీపట్టనట్లు సిగరెట్టు పీల్చుకుంట నిలబడ్డడు మేనేజరు. కట్టెబట్టుకున్న జమేదారు మందిదగ్గరికచ్చిండు.

"ఆయన చెప్పేదేందో పూర్తిగా చెప్పనీయండ్లి ఎవ్వలుగూడ మధ్య మధ్య మాట్లాడకండి ఆయన మాట్లాడుడయినంక మనం మాట్లాడుదాం"; కార్మికుల్లో ఒకడు గట్టిగచెప్పేసరికి.... తిరిగి ప్రశాంతత.

"కార్మిక సోదరులారా సమ్మె మనకు చివరి ఆయుధం. అన్ని అవకాశాలను ఉపయోగించుకొని ఏమికానప్పుడు ఆఖరిసారి మాత్రమే మనం సమ్మెచేయవలసి ఉంటది. కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు రెండుఅడుగులు ఎనుకకేసి ఒక్కఅడుగు ముందు కెయ్యాలె కాబట్టి ఇప్పుడు సమ్మెను విరమించుకొని పనుల్లోకివెల్లండి. కార్మికు లందరికి అడ్వాన్స్ ఇప్పించెటానికి నేను హైదరాబాదులో ప్రభుత్వంతో మాట్లాడి, కొట్లాడి......."

మాటలు పూర్తిగానేలేదు కార్మికుల్లో తిరిగి గందరగోళం.

"మస్టర్లు కోతపెట్టుడు బందుకావాలని మనమంటాంటె అడ్వాన్స్ ఇప్పిస్త దంటడేందిరా"

"ఎప్పుడచ్చినా రెండడుగులు ఎనుకకు, ఒక్కడుగు ముందటికంటడు, తాపకు రెండు అడుగులు ఎనుకకేత్తె మనం ఎక్కడికి పోతాంరా ? .... అయినా మనం అడ్వాన్సుకోసం సమ్మెచేత్తానమా" కార్మికుల్లో కలకలం లేసింది.

లీడరాయనకు మొకాన చెమటపట్టింది జేబులనుండి దస్తితీసి తుడుసుకున్నడు, కార్మికులలొల్లిలో తనమాట అందరికి వినిపిస్తలేదనుకొని గొంతెత్తి మాట్లాడుతాండు.

"కామ్రేడ్స్.... మస్టర్లు కోతపెట్టేచట్టం ఇప్పుడు పుట్టిందికాదు. 1936 నాడు ఇంగ్లీసోల్ల జమానల్నే పుట్టింది. ఈ చట్టం మనకేకాదు, దేశమంతటఉన్నది. దేశ మంతా సమ్మెచేస్తెనే పోతదికాని మన సింగరేణిల్నే సమ్మెచేస్తెపోదు. కాబట్టి రాడికలోల్ల మాటలుపట్టుకొని సమ్మెను కొనసాగించి నష్టపోకుండ్లి. సమ్మెచేస్తె చట్టంపోదు. మేము సుప్రీమ్‌కోర్టుల కేసుపెట్టి సాదించుకత్తం. రాడికలోల్లు మిమ్ముల నష్టపోయేదిమీరే. ఇంద్రవెల్లిలో అమాయకులైన గిరి జనులను రెచ్చగొట్టి 60 మందిని తుపాకులకు గురిచేసిండ్లు. మేము మేనేజిమెంటుతో ఏదో ఒప్పందం చేసుకున్నమని తప్పుడుప్రచారం చేత్తాండ్లు. మా ఎర్రజెండా యూనియన్ నాయకత్వాన 20 పైసలున్న కార్మికుల జీతాన్ని 30 రూ[illegible]య్యేందుకు ఎంతోకొట్లాడి సాదించినం. ఇంకా ఎన్నోహక్కులు సాదించుకున్నం కాబట్టి ......"

కార్మికుల అలజడిలో లీడర్ మాటలు కమ్మేసినయి.

"గా యింద్రివెల్లి సంగతి ఇప్పుడేందిరా వీడుచెప్పేది".

"కంపినోడు అన్నట్లే లీడరోడు అనబట్టె. రాడికలోల్లు ఎగేసుదేమున్నది జీతాల్లల్లకోత పెట్టేది అబద్ధమా ?" అక్కడక్కడ కూసునోల్లు నిలబడి బొగ్గుదుమ్మ అంటుతె దులుపుకుంటలేసి గుంపుల కచ్చిండ్లు.

"6నెల్ల కిందట పండుగమస్టరు కట్టిత్తలేకుంటే బాయిలోల్లు అందరుఆగి లొల్లి బెడితె నేను కేసుపెట్టి గెలిపిత్తనని బాయిలదించి ఏమిసాదించుకచ్చినవర ? కేసుపెడ్త డటకేసు ఏదిఅడిగినా కేసుపెట్టుడే బాయిల దెబ్బతగిలి కాలిరిగినోనికి దవాకాండ్లమందు లిత్తలేరంటె కూడ ఎవలు ఆగి అడుగద్దట ? దానికిగూడ కేసేపెడుతడా వీడుకేసుపెట్టి, వాడు వాదించి యాడాదితర్వాత ఒకేల్ల గెలిసత్తె అప్పటిదాకా దెబ్బతాకినోడు ఆన్నే సత్తడా ? కోర్టోడు మాత్రం సర్కారోడు కాదా ?"

పొద్దుఎక్కి ఎండ మండుతాంది. రాంగకూడ తినిరాక కడుపుల మండుతాంది. లీడరోని మాటలకు కార్మికుల గుండెలు మండుతానయి. ఈ మంట ఆమంటతో లొల్లిఎక్కువైంది. కార్మికులల్ల నుండి లాగుతొడుక్కున్న లాడీసాయిన అటిటుపోయే కార్మికుల్ని దగ్గరకుపిలిసి అందరిముంగట నిలబడి లీడరుచెప్పిందానికి వ్యతిరేకంగా మాట్లాడెసరికి లీడరు మనుసులు మాటలకు అడ్డమచ్చి మాట్లాడనిత్తలేరు.

"ఇగో మీలీడరు మాట్లాడినప్పుడు మేం లొల్లిలేకుండ యున్నం గట్లనే ఇప్పుడు మావోడు మాట్లాడుతాంటె మీరినాలె. నువుమాట్లాడుతాంటే మేం అడ్డన్నమా, మావోన్ని ఎందుకద్దంటాండ్లు ?"; మందిలో మల్లి లొల్లిలేసేసరికి లీడరు మనుసులు పక్కకుజరిగిండ్లు. ముందుకుపోయిన కార్మికుడు మాట్లాడుడు మొదలుపెట్టిండు.

"సూడుల్లి అన్నలారా నిన్నటిదాకనో కోతచట్టమేలేదు, రాడికలోల్లే ఉన్నట్టుగ తప్పుడు పచారం చేత్తాండ్లన్నడు. ఈరోజునోన్న చట్టం ఎనుకన్నేపుట్టింది కేసుపెడ్త నంటాండు, మనం జీతంకోత బందుకావాలని సమ్మెచేత్తాంటే అడ్వాన్స్ ఇప్పిత్త దిగుండ్లని చెప్పుతాండ్లు. అయితే ఎవరు తప్పుడు ప్రచారం చేత్తాండ్లో ఎవలు రెచ్చ గొడతాండ్లో మీరే అర్ధంచేసుకోండ్లి. ఆపదచ్చినప్పుడు సమ్మెచేసెదాకా ఎవడు పట్టించు కుంటలేదు. సమ్మె కార్మికుల జన్మహక్కు.

765

కార్మికులకు లేనిపోని సమస్యలుసృష్టించి మొండితనం అవలంబిస్తున్న మేనేజిమెంటు వాండ్లు కార్మికులను సమ్మెచేసేస్థితికి రెచ్చగొడుతుండ్లు. న్యాయమైన సమస్యల గురించి సమ్మెచేస్తె జీతంలో కోతపెడుతాండ్లు. అంటే సమ్మెచేసేహక్కు మనకు లేదన్నమాట. అయితే మనం వానిసల్లెక్కనే పనిచేయవలసి ఉంటది. అయితే మేనేజిమెంటుతోని ట్రేడ్ యూనియన్లు విద్రోహపు ఒప్పందాలుచేసుకొని కంపినోని దిక్కే మాట్లాడుతాండ్లు. అయితే లీడర్లు కంపినోల్లుకలిసి ఈరకంగ జేసుకుంటనే సమ్మెను మేమే చేపిస్తున్నమని నాకు మరి వేరేఇద్దరికి డిస్మిస్‌లెటర్లు ఇచ్చిండ్లు. కాబట్టి కార్మికులారా ఎవరు ఏమనిచెప్పినా మీకు సమ్మెహక్కుకావాలో లేక దాని సత్వమే కావల్నో ఆలోసించుకోని అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడండి."

కార్మికునిమాటలు పూర్తిగాకముందే యూనియన్ నాయకులు కల్పించుకునే సరికి కార్మికుల్లో లొల్లిమొదలైంది.

"కార్మికుల్లారా యూనియన్ లేకుండా సమ్మెచేసి మీరు ఏమిసాదించుకోలేరు. మా మాటఇనకుంట మీరుంటె మీగుంచి ఎవలు కంపినితోని మాట్లాడుతరో, ఏ లీడరు సాదిస్తదో సాదించుకోండి" కార్మికులమీద అలిగినట్టు మాట్లాడిండు లీడర్.

"ఇగో యూనియన్‌నుండి నువ్వు రాజీనామ పెట్టి పో తర్వాత మాదాంట్లనుండే పుడుతరు లీడర్లు". కార్మికులు.

"వానితోనేందిరా ప్యాపా" అంటు కార్మికులంతా కదిలిండ్లు. ఎవరికి తోచినట్లు వాల్లు లీడర్లను మేనేజిమెంటును తిట్టుకుంట ఇండ్లదారి పట్టిండ్లు. లీడర్ల కుట్రలకు లేబర్లగుండెలు మండుతానయ్.

"కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి;" ఎవరో కార్మికుడు మందిలకెల్లి గొంతెత్తి అరిచిండు. కార్మికులంతా అందుకున్నారు.

"మేనేజిమెంటు దౌర్జన్యం నశించాలి;"

"దొంగ ట్రేడ్ యూనియన్ల కుట్రలను బగ్నంచేయండి;"

"మస్టర్లకోత చట్టానికి వ్యతిరేకంగా పోరాడండి;"

"పోలీసు క్యాంపులను ఎత్తివేయాలి."

కార్మికుల ఊరేగింపు కదులుతు పోతుంటే పోలీసువ్యాను వెంబడించింది.

766